క్లుప్తంగా

మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న పార్వతీపురం ఐడీబీఐ బ్యాంకు మేనేజరు నవీన్

తెర్లాం: మండలంలోని పణుకువలస ప్రాథమిక పాఠశాలకు పార్వతీపురానికి చెందిన ఐడీబీఐ బ్యాంకు వారు మైక్‌సెట్ వితరణ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఐడీబీఐ బ్యాంకు బ్రాంచి మేనేజరు నవీన్, బ్యాంకు అధికారి అచ్యుతరావు కలిసి సర్పంచ్ చందక సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రమణలకు ఆ సామగ్రి ఆదివారం అందజేశారు. బ్యాంకు బ్రాంచి మేనేజరు మాట్లాడుతూ ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఓ పాఠశాలకు ఏదో ఒక విలువైన వస్తువును వితరణ చేస్తామని, అందులో భాగంగానే ఈ ఏడాది తెర్లాం మండలంలోని పణుకువలస ప్రాథమిక పాఠశాలకు మైక్‌సెట్ ఇవ్వడం జరిగిందన్నారు. దాతలకు సర్పంచ్, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం



లక్ష్మీపురంలో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

రేగిడి: మండల పరిషత్ నిధులతో మండలంలోని ప్రతీ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతోంది. లక్ష్మీపురంలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. జెడ్పీటీసీ సభ్యులు పాలవలస ఇందుమతి, ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు ప్రతీ పంచాయతీకి ఈ నిధులను అందజేయగా వాటితో సర్పంచ్‌లు నిర్మాణ పనులు చేయిస్తున్నారు.

ఉత్తమ ఎన్నికల అధికారిగా ఏపీఎం



ప్రశంసాపత్రం అందిస్తున్న తహసీల్దారు సత్యం

సంతకవిటి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించిన పలువురు ఉద్యోగులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందించి, ఆదివారం సత్కరించారు. దీనిలో భాగంగా ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా ఉత్తమ సేవలందించిన ఏపీఎం టి.దది కుమార్‌కు తహసీల్దారు బి.సత్యం చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేసి, ఆయన సేవలను అభినందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం ఏవో రఘునాధాచారి, సర్వే డీటీ మధు, ఎంఈవో బి.శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

గోతుల పూడ్చివేత



గోతులను రాతిబుగ్గితో పూడ్చి, రోడ్డును సమతలం చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ప్రధాన రోడ్డులో ఏర్పడిన గోతుల పూడ్చివేత పనులు ఆదివారం చేపట్టారు. ఇక్కడ ఏర్పడిన గోతుల కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న నేపథ్యంలో ఈ నెల 22వ తేదీన 'గోతులతో ప్రజలకు ఇబ్బందులు' అనే శీర్షిక పేరుతో వార్త ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణ్.. ఆ గోతులను రాతిబుగ్గితో పూడ్చివేయించారు. త్వరలోనే రోడ్డు మరమ్మతులు చేసి, బీటీ రోడ్డు నిర్మాణం కూడా చేస్తామన్నారు.

విద్యార్థులకు ప్రమాణ పత్రాల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో సిబ్బంది

రాజాం: మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద దక్షిణ భారత హిందీ ప్రచార సభ, మద్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ, మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక తదితర పరీక్షలకు సంబంధించి, ప్రమాణ పత్రాల ప్రదానోత్సవం ఆదివారం అట్టహాసంగా జరిగింది. గతంలో ఇక్కడ నిర్వహించిన ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు ఆనెం మహేశ్వరరావు చేతులమీదుగా హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు సర్టిఫికెట్లు అందజేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

వాడవాడలా గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులంతా జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఏటా ఈ దినోత్సవం జరుపుకుంటుండడం విశేషం. గణతంత్ర రాజ్యంలో ప్రజలే ప్రభుత్వమని.. ప్రభుత్వమే ప్రజలని.. ఇక్కడ రాజ్యాధికారం ప్రజలది.. వారు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులది అని వక్తలు తెలిపారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగ విలువలు పాటించి, రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని కోరారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



బాడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థిని భరతమాత వేషధారణ



రామభద్రపురం ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న జెడ్పీటీసీ సరస్వతి, సీహెచ్ సన్యాసిరావు



బొబ్బిలి వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆవరణలో జాతీయ జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



తెర్లాం తహసీల్దారు కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తహసీల్దారు హేమంత్‌కుమార్



తెర్లాం ఎంపీడీవో కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకం ఎగురవేస్తున్న ఎంపీడీవో రాంబాబు



బొబ్బిలి: సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి అరుణ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం



బాడంగి తహసీల్దారు కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకలు



రేగిడి పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్‌ఐ నీలావతి, సిబ్బంది



బాడంగి ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గౌరు, జెడ్పీటీసీ రామారావు, ఎంపీడీవో రామకృష్ణ



సంతకవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణతంత్ర వేడుకల్లో మువ్వన్నెల జెండా రెపరెపలు



రాజాం సిటీ: రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జెండాకు వందనం చేస్తున్న దృశ్యం



రాజాం సిటీ: ఆకట్టుకున్న సన్ స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థుల విన్యాసం



రాజాం: పెనుబాక సచివాలయం వద్ద జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నర్సింహులు



రాజాం వరలక్ష్మీ సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద గణతంత్ర వేడుకలు



రేగిడి: తోకలవలస సచివాలయం వద్ద గణతంత్ర వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు



వంగర: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎస్‌ఐ షేక్ శంకర్



రేగిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

● గర్భకోశ వ్యాధులపై అప్రమత్తం



పశువులకు సోకే గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పాడిరైతులకు పొగిరి పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి దీపిక సూచించారు. రాజాం మండలంలోని బొడ్డవలస గ్రామంలో పశువైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. అక్కడికి వచ్చిన పశువులు సహా గొర్రెలు, మేకలు, కోళ్లు వంటి మూగజీవాలకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వాటికి ఉచితంగా మందులు అందజేశారు. ముఖ్యంగా పాడిఆవులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు చేసి, ఆపరేషన్లు చేశారు.

–రాజాం

● నిలిచిన పల్లెపండగ పనులు



పల్లెపండగ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు వేసి చూపిస్తామని సీఎం చంద్రబాబు, కూటమి నేతలు చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదు. ఆఖరికి పండగ వెళ్లిపోయి రోజులు గడుస్తున్నా.. అర్ధాంతరంగా నిలిచిన పనుల పూర్తిపై అధికార యంత్రాంగం దృష్టిసారించడం లేదు. బాడంగి మండలంలో రూ.6 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో 89 పనులు మంజూరు కాగా వాటిలో 50 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం నిలిచిన అభివృద్ధి పనులపై గ్రామీణుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాటలు కాదు చేసి చూపించాలంటున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తోన్న నిలిచిన రోడ్డు నిర్మాణం.. బాడంగి మండలంలో రాజాం బీటీ రోడ్డు నుంచి ముగడ వెళ్లే రోడ్డు.

–బాడంగి

● సస్యరక్షణ తప్పనిసరి



మొక్కజొన్న సాగులో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులకు సస్యరక్షణ చర్యలు చేపట్టడం తప్పనిసరి అని ఏవో మురళీకృష్ణ సూచించారు. రేగిడి మండలంలోని వండానపేట, చాటాయివలస, అంబకండి తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ఆయన ఆదివారం పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పంటకు కత్తెరపురుగు సోకి ఉండడాన్ని గమనించి, నివారణ మందు పిచికారీ చేసి పంటను కాపాడుకోవాలన్నారు. వండానపేటలో మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు నివారణ మందు పిచికారీ చేయించారు. పంట చేతికి వచ్చేంత వరకు ప్రతి దశలోనూ జాగ్రత్త వహించాలని, పంటను కాపాడుకోవాలని తెలిపారు.

– రేగిడి

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



ఐడీబీఐ బ్రాంచి సభ్యులు పాఠశాలకు సమకూర్చిన ఆర్వో ప్లాంట్

రాజాం సిటీ: మండలంలోని గుయ్యానవలస గ్రామ ఎంపీపీ పాఠశాలకు విజయనగరానికి చెందిన ఐడీబీఐ సభ్యులు ఆర్వో ప్లాంట్ అందించారని ప్రధానోపాధ్యాయుడు చిరంజీవులునాయుడు ఆదివారం తెలిపారు. సామాజిక బాధ్యత పథకం కింద రూ.35 వేల విలువైన ఆర్వో ప్లాంట్‌తో పాటు రెండు అల్మారాలు, ఓ రేఖను అందించారన్నారు. కార్యక్రమంలో ఐడీబీఐ ఏజీఎం ఆర్.ఉమాకాంత్, సర్పంచ్ ఎస్.లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ వి.భాస్కరరావు, ఉపాధ్యాయులు పి.సృజన, పార్వతీపురం బ్రాంచి మేనేజర్ బి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తరచూ అవినీతి ఆరోపణలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాజకీయాల్లో బొబ్బిలి రాజకీయాలకు ఓ చరిత్ర ఉందని, భూములు ఆక్రమించుకున్న ఎమ్మెల్యే అనే మాట తాను ఇంతవరకు వినలేదని, ఈ మధ్యకాలంలో ఎమ్మెల్యే బేబీనాయనపై తరచూ అటువంటి అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలకు ఆయన హాజరై, జెండా వందనం అనంతరం కాసేపు విలేకరులతో మాట్లాడారు. నిరుపేదలకు చెందిన భూములను ఎమ్మెల్యే ఆక్రమించుకుని, వాటిల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి అమ్ముకుంటున్నారని విన్నానని, దీనిపై పత్రికల్లో వచ్చిన వార్తలు కూడా చదివానన్నారు. ఆయనపై వస్తున్న ఆరోపణలు నిజమో కాదో నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. సంక్రాంతి పండగ నాటికి గుంతలు లేని రోడ్లు వేసి చూపిస్తామన్న కూటమి నాయకులు ఏమైపోయారని ప్రశ్నించారు. చిత్తశుద్ధి, నిబద్ధత ఉంటే ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చాలని అటు ప్రభుత్వాన్ని, ఇటు ఎమ్మెల్యేని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నందబలగలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం, నందబలగ గ్రామాల్లో మృతుల కుటుంబాలను వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం పరామర్శించారు. బొద్దాంలో పార్టీ నాయకుడు మూకల్ల కృష్ణ, నందబలగలో పార్టీ సీనియర్ నేత గంగు ఆదినారాయణలు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ రాజేష్.. ఉదయం ఆయా గ్రామాలు వెళ్లి, వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్‌లు కొర్ను ఈశ్వరరావు, నక్క శ్రీనివాసరావు, బింగి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి..

పూసపాటిరేగ: మండలంలోని పతివాడబర్రిపేట గ్రామంలో తమకు చెందిన భూమిపై న్యాయస్థానం ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినా.. కొంతమంది కొబ్బరి చెట్లు నరికి వేశారని గ్రామానికి చెందిన బర్రి నూకరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ కుటుంబీకులకు చెందిన గృహానికి ఆనుకుని ఉన్న నాలుగు సెంట్ల భూమిపై న్యాయస్థానం 2023లో ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ కొంతమంది స్థలంలో ఉన్న చెట్లను నరికివేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు స్పందించి కోర్టు ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.